క్లుప్తంగా

'వై ఏపీ నీడ్స్ జగన్' రెండో విడత నేటి నుంచి

కోటవురట్ల : ఏపీకి జగనే ఎందుకు కావాలంటే... రెండో విడత కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. మంగళవారం బి.కె.పల్లి, 29న బోడపాలెం, 30న చినబొడ్డేపల్లి, డిసెంబర్ 1న కె.వెంకటాపురం, 4న కొడవటిపూడి, 5న పి.కె.పల్లి, 6న పాములవాక, 7న రామచంద్రపాలెం, 8న రాజుపేట, 11న కోటవురట్ల-2లో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

నేడు చెర్లోపాలెంలో

మునగపాక : మండలంలోని చెర్లోపాలెం సచివాలయంలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీ ఆవిష్కరణ, అలాగే ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఏఈ రమేష్

మునగపాక : ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఏఈ పాలకొండ రమేష్ కోరారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మునగపాకలో ప్రజలకు సీజనల్ రోగాల పట్ల అవగాహన కల్పించారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ఆసుపత్రులకు వెళ్లాలన్నారు. చలికాలంలో కాచి చల్లార్చిన నీరు తాగడం మంచిదన్నారు. సీసీ ప్రగడ అన్నపూర్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించారు



సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని పి.ధర్మవరం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ వెదుళ్ల బంగారి అన్నారు. గ్రామంలో మండల పరిషత్ అధికారులు సహకారంతో ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి శ్రీనివాసరావు, గృహసారథుల మండల కన్వీనర్ దోసపాత్రుని సందీప్ కుమార్ పాల్గొన్నారు.

సర్వ శిక్షా అభియాన్ సిబ్బంది సమ్మె నోటీసు



సమ్మె నోటీసును అందజేస్తున్న ఎస్ఎస్ఏ యూనియన్ ప్రతినిధులు

పాయకరావుపేట : సర్వ శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు డిసెంబర్ 20 నుంచి సమ్మె చేస్తున్నట్టు మండల విద్యాశాఖ అధికారి కె.ఎస్.గాంధీకి నోటీసు అందజేశారు. సర్వ శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు 15 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును ఎంఈవో కె.ఎస్.గాంధీకి సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద అందజేశారు.



ఈమె పేరు గిన్ని రామలక్ష్మి. యలమంచిలి పట్టణం కోర్టు కూడలికి చెందిన ఈమెకు వైఎస్సార్ ఆసరా కొండంత భరోసా కల్పించింది. శ్రీ శివసాయి స్వయం సహాయక సంఘం సభ్యురాలిగా ఉన్న రామలక్ష్మి, మిగతా సభ్యులు క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సత్య సలహాతో 2019 మార్చి 31వ తేదీన బ్యాంకులో రూ.7.50 లక్షలు రుణం తీసుకున్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంఘాలకు 2019 ఏప్రిల్ 11 వరకు బ్యాంకుల్లో ఉన్న రుణాలను ఆసరా పథకం ద్వారా మాఫీ చేస్తామని ప్రకటించడంతో ఈమె దశ తిరిగింది. పొందిన రుణం వడ్డీతో సహా రూ.7.54 లక్షలు మాఫీ అయ్యాయి. దీంతో రామలక్ష్మికి ఆర్థికంగా ఎంతో ఆసరా లభించింది. ప్రస్తుతం ఆమె టైలరింగ్ శిక్షణ కేంద్రంతో పాటు హెర్బల్ బ్యూటీ పార్లర్ నడుపుతున్నారు. ఈమె వద్ద 15 మంది మహిళలు టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. ఈమె పెద్ద కుమార్తె జ్యోతి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. చిన్న కుమార్తె శ్వేత అమెరికాలో ఎంఎస్ చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆసరా సాయంతో పాటు విదేశాల్లో చదువుకునేందుకు బ్యాంకు రుణం కూడా మంజూరవవడంతో తన కుమార్తెలను బాగా చదివించుకోగలిగానని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.



పులపర్తి గ్రామానికి చెందిన కరుణామయి మహిళా సంఘం సభ్యురాలు పిట్ల మంగకు మూడు విడతల్లో రూ.57 వేలు ఆసరా రుణమాఫీ అందింది. వీరి గ్రూపు మొత్తానికి రూ.5.7 లక్షలు రుణమాఫీకి అర్హత వచ్చింది. వీరి గ్రూపునకు బ్యాంకు రుణం రూ.10 లక్షలు మంజూరైంది. దీంతో పాటు స్త్రీనిధి రూ.50వేలు, రెండు విడతల వైఎస్సార్ చేయూత ద్వారా రూ.37,500, సీఐఎఫ్ నిధులు రూ.20 వేలు అందాయి. పలు పథకాల ద్వారా ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధి పొందడంతో మంగ ఆ డబ్బుతో తన గొర్రెల మందను వృద్ధి చేసుకుంది. ఆమె వద్ద 50 వరకూ గొర్రెలు ఉన్నాయి. వాటిని భర్త రమణతో కలిసి సంరక్షిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అంతకుముందు ప్రభుత్వంలో తమ జీవితం ఆర్థిక ఇబ్బందులతో ఒడిదుడుకులకు లోనయ్యేదని,ప్రస్తుతం సీఎం జగనన్న చల్లని చూపుతో ఆర్థికంగా ఇబ్బందులను అధిగమించి, కుటుంబ జీవనం సాఫీగా సాగిపోతోందని మంగ చెబుతున్నారు.

యలమంచిలి పట్టణంలో ఆసరా (రుణమాఫీ) వివరాలు:

సంఘాలు : 776
సభ్యులు : 7922
మొదటి విడత రుణమాఫీ : రూ.6,94,88,568
2వ విడత : రూ. 7,70,60.679
3వ విడత : రూ.7,32,91,115
మొత్తం రుణమాఫీ : రూ.29,08,32,118

యలమంచిలి మండలంలో...

సంఘాలు : 581
సభ్యులు : 6394
మొదటి విడత రుణమాఫీ : రూ.5,00,14,850
రెండో విడత : రూ.5,00,14,850
మూడో విడత : 5,00,14,850
మొత్తం : రూ.15,00,44,550

అతివల ఆర్థికాభివృద్ధికి ఆసరా







పట్టణంలో కోర్టు కూడలి వద్ద ఆసరా సాయం రూ.1.20 లక్షలు, బ్యాంకు రుణంతో కూరగాయల దుకాణం నిర్వహిస్తున్న గొలుసుపూడి శ్యామల

యలమంచిలి (అనకాపల్లి రూరల్): స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక ప్రగతి సాధించాలన్నది సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం. ఇతరులపై ఆధారపడకుండా స్వశక్తితో జీవించేలా ప్రోత్సహించేందుకు 'వైఎస్సార్ ఆసరా' పథకానికి రూపకల్పన చేశారు. సీఎం జగన్ ప్రతిపక్షనేతగా పాదయాత్ర చేసిన సమయంలో తాను అధికారంలోకి వస్తే దశల వారీగా రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. 2019 ఏప్రిల్ 11 నాటికి వారు తీసుకున్న రుణాలను ఎంతైతే అప్పు నిల్వ మిగిలి ఉంటుందో వాటిని నాలుగు విడతలుగా ఆయా సంఘాలకు చెల్లించేందుకు ఆసరా పథకం కింద నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.ఆ మేరకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సంఘాల్లో మహిళలు తీసుకున్న రుణాలను విడతల వారీగా మాఫీకి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు మూడు విడతల్లో రుణమాఫీ చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆసరా సొమ్ముతో మహిళలు స్వయం ఉపాధి దిశగా దృష్టి సారిస్తున్నారు. దీంతో పాటు స్త్రీనిధి, చేయూత వంటి పథకాల ద్వారా వస్తున్న ఆర్థిక సాయాన్ని జత చేసుకుని పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకం, కూరగాయలు, కిరాణా, చిల్లర దుకాణాలు, బెల్లంతో తయారు చేసే వేరుశెనగ పప్పు ఉండలు, టైలరింగ్,హెర్బల్ బ్యూటీ పార్లర్, గుడ్లు విక్రయించడం వంటి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ వచ్చిన డబ్బుతో కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. మహిళల జీవన ప్రమాణాలు, ఆర్థిక ప్రగతి సాధించేందుకు ఆసరా పథకం ఎంతగానో దోహదపడుతోంది. రుణమాఫీ ద్వారా వచ్చే సొమ్ముతో చిరు వ్యాపారాలు చేసుకుంటూ మహిళలు కుటుంబ పోషణలో భర్తకు చేదోడుగా నిలుస్తున్నారు.

టీడీపీ హయాంలో మోసం

టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాలకు తీరని అన్యాయం జరిగింది. 2014 ఎన్నికలకు ముందు డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. దీంతో మహిళలు రుణాలు చెల్లించలేదు.అనంతరం అధికారంలోకి వచ్చాక బాబు ఆ హామీ ఊసే ఎత్తలేదు. అరకొరగా టీడీపీ సానుభూతిపరులకు మాత్రమే కొంతమేర మాఫీ చేశారు. దీంతో చేసేది లేక మహిళలు చేసిన అప్పుకు వడ్డీతో సహా చెల్లించాల్సిన దుస్థితి తలెత్తింది.

మాట ప్రకారమే మాఫీ



మహిళలను రుణ విముక్తుల్ని చేసేందుకు సీఎం జగనన్న వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేయడం సంతోషకరం. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీకి ఈ పథకం కింద ఏటా సాయమందిస్తూ మాలాంటి వారి బతుకుల్లో ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు సీఎం జగనన్న కృషి చేస్తున్నారు. మా గ్రూపు తీసుకున్న రుణంలో మూడు విడతల్లో రూ.2.1 లక్షలు రుణమాఫీ చేశారు.

–గంగిరెడ్డి వరలక్ష్మి, దర్మవరం, యలమంచిలి

విశ్వసనీయతకు జగన్ మారుపేరు



సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీలను ఆచరణలో పెట్టి విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారు. పొదుపు సంఘాల ఖాతాల్లోకే నగదు జమ చేసే సంచలనాత్మక కార్యక్రమం ఇప్పటిదాకా దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదు. మా సంఘానికి ఇప్పటివరకూ రూ.1.75 లక్షలు రుణ మొత్తం జమ అయింది. ఆసరా సాయంతో పొగాకు వ్యాపారం చేస్తున్నా. చేయూత సొమ్ము కూడా అందింది. దీంతో ఆర్థిక స్వేచ్ఛ కలిగింది. సీఎం జగనన్నకు కృతజ్ఞతగా ఉంటాం.

–తంగేటి చంద్రకళ, లబ్ధిదారు, శ్రీ మహలక్ష్మి గ్రూపు, యలమంచిలి

మేలు మరువలేం



నేను శ్రీకృష్ణ గ్రూపులో సభ్యురాలిగా ఉన్నాను. మా సంఘానికి మూడు విడతల ఆసరా పథకం నిధుల విడుదల ద్వారా రూ.1.68 లక్షలు మాఫీ అయింది. ఈ సొమ్ముతో ఇంటి వద్దే టైలరింగ్ చేసుకుంటూ కొంత ఉపాధి పొందుతున్నాను. సీఎం జగన్ మాకు తోబుట్టువుగా అండగా ఉంటున్నారు. చెప్పిన మాట ప్రకారం ఇప్పటికే మూడు దఫాల్లో పొదుపు సంఘాల ఖాతాల్లో రుణాల మొత్తాన్ని జమ చేశారు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

–పుల్లా ఉమ, ధర్మవరం, యలమంచిలి

రహదారుల అభివృద్ధే ధ్యేయంగా కృషి



కశింకోట-మునగపాక రోడ్డును పరిశీలిస్తున్న అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి

మునగపాక : రహదారుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం సేవలందిస్తుందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద కశింకోట నుంచి వయా పెదపాడు మీదుగా మునగపాక వరకు నిర్మిస్తున్న రహదారి పనులను ఆమె సోమవారం పరిశీలించారు. డిసెంబర్ నెలాఖరులోగా పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ మార్గంలోని రైతులు తమ పంటను మండల కేంద్రాలు, జిల్లా కేంద్రానికి తీసుకువచ్చేందుకు అనువుగా రహదారి దోహదపడుతుందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఈ మార్గంలో మూడు చోట్ల వంతెనలు వెడల్పు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.5.8 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయన్నారు. సంబంధిత నిధులతో వంతెనల వెడల్పు పనులు కూడా వేగవంతమయ్యేలా చూడాలన్నారు. దీనిలో భాగంగా పలువురు రైతులు కొంతకాలంగా సరైన రహదారి సదుపాయం లేక పడుతున్న ఇబ్బందులు పరిష్కారానికి కృషి చేసిన ఎంపీ సత్యవతికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మునగపాక ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, పలువురు రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజలకు చేరువగా పాలన



అమలాపురంలో సచివాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పాలన చేరువైందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సోమవారం చందనాడ, అమలాపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 12 ప్రభుత్వ శాఖల సిబ్బందిని అందుబాటులో ఉంచి సేవలు అందించడం వల్ల ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లే ఇబ్బందులు తొలగిపోయాయన్నారు. మహాత్మాగాంధీ, డాక్టర్ అంబేడ్కర్ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని జగనన్న స్థాపించారన్నారు. వారి ఆశయాలను సాకారం చేస్తున్నారన్నారు. దాదాపు 5 వందల రకాల ప్రభుత్వ సేవలు సచివాలయంలోనే అందుబాటులోకి వచ్చాయన్నారు. పైసా ఖర్చులేకుండా వలంటీర్ల సాయంతో లబ్ధిదారులు సంక్షేమ పథకాలు పొందే అవకాశం కలిగిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కూడా గ్రామాల్లోనే సరఫరా చేసే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యు రాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వ రరావు, సర్పంచ్‌లు తళ్ల రోహిణీ భార్గవ్, పెదపూడి శంకర్రావు, ఎంపీటీసీలు గంటా తిరుపతిరావు, చంద్రరావు, తంగెళ్ల కృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గోవిందు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, సింహాచలం దేవస్థానం సభ్యురాలు శేషారత్నం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రొక్కళ్ల శ్రీను, తళ్ల అప్పలస్వామి, బాబూరావు, మాజీ జెడ్పీటీసీ నీలేంద్రరావు, ఉపసర్పంచ్ గబ్బర్ సింగ్ పాల్గొన్నారు.

హరిహరార్చన పుస్తకాల పంపిణీ

రాంబిల్లి: పంచదార్ల పుణ్యక్షేత్రంలో సోమవారం ట్రాఫిక్ ఎస్ఐ ఈశ్వరరావు, దేవాలయ ఈవో సాంబశివరావు చేతుల మీదుగా హరిహరార్చన పుస్తకాలను భక్తులకు అందజేశారు. వేద విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో ఈ పుస్తక పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్షరయజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నం అర్జునరావు, ఆడారి జోగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు పెదపాడు జువ్వాలమ్మ తల్లి పండగ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పెదపాడు గ్రామంలో ఈ నెల 28న జువ్వాలమ్మ తల్లి పండగను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామ దేవత అయిన అమ్మవారి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పూల అలంకరణ చేసి, విద్యుత్ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. తెల్లవారు జాము నుంచి భక్తుల రద్దీ పెరగనున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లను కమిటీ పర్యవేక్షించింది.

మార్మోగిన శివ నామస్మరణ



శివాలయంలో అభిషేకంలో పాల్గొన్న భక్తులు



ఉపమాక శివాలయానికి తరలివచ్చిన భక్తులు



స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు



మునగపాక లింగరాయి గుడిలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

కోటవురట్ల : కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జాము నుంచి ఆలయాలలో భక్తుల తాకిడి నెలకొంది. వరాహనది తీరాన ఉన్న శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి, చినలింగాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వర అయ్యప్ప ఆలయం, యండపల్లి శివారు శ్రీ ఆత్మలింగేశ్వరస్వామి ఆలయాలలో భక్తుల కోలాహలం కనిపించింది. శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో అన్న సమారాధన నిర్వహించారు.

మునగపాక : కార్తీకమాసం రెండో సోమవారం ఆలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. భక్తులు శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి శివపార్వతులను దర్శించుకున్నారు. మునగపాక లింగరాయి గుడిలో కుంకుమపూజలు నిర్వహించారు. నాగులాపల్లిలోని పురాతన శివాలయం, మునగపాకలోని సాంబశివుని ఆలయం, గణపర్తిలోని శివాలయం, వాడ్రాపల్లిలోని దక్షిణేశ్వర స్వామి ఆలయం, టి.సిరసపల్లిలోని వీరభద్రస్వామి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

ఉపమాకకు పోటెత్తిన భక్తులు

నక్కపల్లి: మండలంలో ప్రాచీన శివాలయం ఉపమాకలో ఉన్న శ్రీ భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వర స్వామి ఆలయానికి కార్తీక సోమవారం భక్తులు అధికంగా తరలివచ్చారు. అర్చక స్వామి మహేష్ ఉదయాన్నే స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. నక్కపల్లి, ఉపమాక, సారిపల్లిపాలెం, జానకయ్యపేట, సిహెచ్ ఎల్‌పురం, తీనార్ల, రాజయ్యపేట తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి దర్శించుకున్నారు. నవగ్రహాలకు పూజలు చేశారు. ధ్వజ స్తంభం వద్ద, బందుర సరస్సు వద్ద దీపారాధన చేశారు.

పంచదార్లలో ...

రాంబిల్లి: పంచదార్ల పుణ్యక్షేత్రం కార్తీక రెండో సోమవారం సందర్భంగా శివ నామ స్మరణతో మార్మోగింది. ఆకాశధార వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం క్షేత్ర పాలకుడు ఉమా ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. కాశీ విశ్వేశ్వరస్వామి , సహస్ర లింగేశ్వరస్వామి, రాధా మాధవస్వామి, ద్విముఖ కళ్యాణ వినాయకున్ని దర్శించుకొన్నారు. దిమిలిలో చారిత్రక నగ్నేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిగాయి.



వాడ్రాపల్లి దక్షిణేశ్వరుని ఆలయంలోని శివలింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు



మునగపాకలో పార్వతీపరమేశ్వరులను దర్శించుకుంటున్న సర్పంచ్ అప్పారావు



దిమిలిలో నగ్నేశ్వరస్వామి సన్నిధిలో భక్తులు

ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు



హరిపాలెంలో సారె ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి): హరిపాలెంలో సోమవారం గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.ఈ నెల 29న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం శరగడం సూర్యనారాయణ,వరలక్ష్మి దంపతుల ఇంటి వద్ద నుంచి పసుపు కుంకుమలతో మందుగుండు సామాగ్రిని కాల్చుతూ గాంధీ సెంటర్‌ను విచ్చేశారు. పిండి వంటలు,పండ్లు, ఇతర సారెతో స్థానిక ముత్తయిదువులు,పెద్దలు కలిసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.